# నినాదం

శ్రీ యాముజాల శంకరం

**A. B.**—అనే రెండు దేశాల మధ్య సంకుల సమరం సాగుతోంది. మానవాళికి మృత్యుగహ్వారం తెరుచుకుంది. అదంతా పైశాచిక ప్రళయతాండవం.

అయితే యుద్ధం ఎందుకు జరుగుతోందో, ఎవరికీ తెలియదు. రెండు దేశాలూ సర్వ సంపత్సమృద్ధము లయినవే! అన్ని దేశాలలా కాకుండా యీ రెండు దేశాలలోనూ కలిగినవారే ఎక్కువ; లేనివారు బహు తక్కువ. మొత్తంమీద యుద్ధం కొనసాగుతోంది.

'A'—అనే దేశంలో 'ఎర్నెష్టు'—అనే వ్యక్తి ఉన్నాడు; అతనొక కెప్టెన్. అతిసామాన్య సైనికుడుగా చేరి భుజబలంవల్ల, బుద్ధిబలంవల్ల, అసమాన ప్రజ్ఞానైపుణ్యములవల్ల అతిత్వరలో యీ పదవి నాక్రమించగలిగాడు.

సాహసోపేతములైన అతనిచర్యలకు మెచ్చి ప్రభుత్వం అతనికి అనేకబహుమతులిచ్చింది. సర్వ సైన్యాధిపతి అతనికి ప్రత్యేకంగా ఒక బంగారు పతకాన్ని బహూకరించటమే కాకుండా, 'వీర వరుడు'—అనే బిరుదప్రదానంకూడా చేశాడు. అతనంటే ప్రజకూ, ప్రభుత్వానికీకూడా ఎంతో మెచ్చుకోలు. అందుకే ఆ వీరవరునకు అమితగర్వం; పట్టరాని అహంకారం.

దానికితగ్గట్టు భీకరమైన విగ్రహం. మేఘగర్జనలా ఉంటుం దతనిగొంతు. ఆజానుబాహుడు, వెడల్పయిన వక్షస్థలం. ఆ విశాలనయనాల్లో అగ్నిజ్వాలలు రేకెత్తినట్లు, రక్తపుజీరలు రగులుకుంటూ ఉంటాయి. పదిమంది మహాబలవంతులు మీదపడితే ఒక్క విదిలింపుతో అల్లంతదూరాన పడతారు.

ఎప్పుడూ చిత్తుగా త్రాగి, మత్తుగా పడుంటాడు. 'శత్రువు'—అంటే మండిపడతాడు. మనుష్యుల్ని చంపటానికి మహోత్సాహం చూపుతాడు. అతడు త్రాగే సిగరెట్టు విలువైనా యివ్వడు మానవప్రాణికి. కొన్ని సంవత్సరాలనుంచీ యీ భయంకరప్రవృత్తి కలవాటు పడ్డాడు. ఎల్లప్పుడూ మానవుల ప్రాణాలు తీయటమే అతని పని అయినందువల్ల, దయ, జాలి, ప్రేమ—అవి అసలెలా ఉంటాయో అతనికి తెలియదు.

గుడారంలో పడుకున్నవాడికి యుద్ధభూమి చూడాలని బుద్ధిపుట్టి బయలుదేరాడు. తన బలగంతో తను చాలామందిని హతమార్చగలిగాడు. తనకు వప్పజెప్పిన ప్రాంతమంతా నాశనంచేసి వదలిపెట్టాడు. అదంతా తన నేర్పరితనం. బుద్ధికౌశలం. కాకపోతే మరొకడు అమాత్రం సైన్యంతో అంత బీభత్సం చేయగలడా?

ఆ వీరవరుడు కొంచెం ముందుకు నడిచాడు. శవాలు కాలికి తగిలాయి; బూటుకాలితో బంతుల్ని తన్నినట్టు తన్నేశాడు. వికారాకృతులైన శవాలు—ఒకదానికి కాళ్లు లేవు—మరొకదానికి చేతులు,—ఇంకోటి వట్టి మొండెమే!...వట్టి తలలు మాత్రం అక్కడక్కడా ఉన్నాయి. కొన్ని ముఖాలు ఆశ్చర్యంగా...కొన్ని వికృతంగా......దీనంగా; పలు రకాలు—ఎడ నెడా కొన్ని మూలుగులు వినిపించుతున్నయ్. మధ్య మధ్య యీ వీరవరుడు "సెహబాష్" అనుకునేవాడు.

తల దించేసరికి ఉరస్సుమీద మెరిసే పతకాలు తళుక్కుమన్నప్పుడల్లా అతని హృదయం ఆనందంతో జలదరించేది.

తలెత్తాడు. తన సైనికులు దగ్ధపరచిన శత్రుపట్టణం పూర్తిగా నేలమట్టమయింది. ఆ బూడిదలో నుంచి నిప్పురవ్వలు రివ్వగాలికి రాజుకుంటున్నాయి. "బాగుంది......" నవ్వాడు.

ముందుకు నడచాడు. ఒక సైనికుడు కాలికి తగిలాడు; అవసానదశ—స్పృహ లేదు—ఇక రాదు. తల

వాలిపోయింది. ఎప్పుడోగాని గాలి పీల్చడు. ఆ పీల్చినప్పుడు కొంచెం తల పైకి లేస్తుంది. నోటితో పీలుస్తాడు. ఎక్కిళ్లు వస్తున్నాయి. నడుములదాకా కాళ్లు తెగిపోయాయి. “ఏయ్”—అంటూ పిలిచాడు. కాని కదల్లేదు. బూటుకాలితో చిన్నగా తన్నాడు. అంతే ఒకే ఒక్క శ్వాస పీల్చాడా వ్యక్తి. మరిహ పీల్చలేదు.

అతనింతవరకు మనుష్యుల్ని చంపినమాట వాస్తవమే. కాని చస్తున్న మనిషి నెప్పుడూ తనింత యిదిగా చూడలేదు. ఇప్పుడు చూచాడు.

“జీవితం ఇంతేనా!...” అని ఒక్కసారి అనుకున్నాడు. అతనిజీవితంలో అలా యోచించింది· అనుకుందికూడా అదొక్కసారే. అదైనా ఒక్క క్షణం. తలెత్తి నిట్టూర్చాడు. నడచాడు.

ప్రాణంతో పోరాడుతూన్న శరీరాలు కొన్ని కనుపించాయి. శరీరభాగాల్లోంచి రక్తం కారుతోంది. అతనిముందు పడ్డాడు, అందులో ఒకవ్యక్తి, చైతన్యం ఉండి, శక్తిలేక ప్రాణంతో పోరాడేజీవి.

“దాహం ... దాహం ...” అరుస్తున్నాడు. ఇతను ‘B’ దేశపు సైనికుడు. పేరు మోరల్. బలమైన దెబ్బలు తగిలాయి. ఒకకాలు మణికట్టుదాకా ఎగిరిపోయింది. ప్రాణాలింకా ఉన్నాయి. శరీరమంతా రక్తంతో తడిసి ముద్దయింది. బాధ భరించలేక మనిషంతా విల్లులాగా వంగిపోతున్నాడు. దాహంతో అతనినాలుక పిడుచకట్టుకొనిపోయింది. కడుపు చేత్తో పట్టుకున్నాడు.

తలెత్తాడు మోరల్. ఎర్నెష్టు తన శత్రువని గ్రహించాడు. కెప్టెన్ అతన్ని చూస్తూ నిలుచుండిపోయాడు. అతనిలో ఆవేదనా లేదు, జాలీలేదు... ఊరికే చూస్తున్నాడు.

“నువ్వా! ... నువ్వు నాకెలా సహాయపడతావు” అన్నాడు మోరల్—వణకుతోంది గొంతు. తొణుకుతున్నాయి మాటలు. గట్టిగా, బాధతో మూలుగుతూ, శరీరమంతా మెలిపెట్టుకుంటూ దొర్లాడు.

“సహాయం!...పవిత్రమైన నా దేశాన్నాక్రమించుకోవటానికి ప్రయత్నించే వైరిదేశాన్ని, వారి సేనలను నాశనంచేయటానికి కంకణం కట్టుకున్న మహావీరుడు ... మేధావి...నీకు సహాయపడటమా!... హాహ్హాహ్హాహ్హా...”

“నవ్వకు; చూడు! నేనూ ఒకప్పుడు నా దేశాన్ని చాలా పవిత్రంగా భావించాను. ఇదిగో... నవ్వకు...ఇప్పుడు నేను చస్తున్నాను. నువ్వు నవ్వుతున్నావు. నాలాగే, ఇలాగే, రేపు నువ్వూ చస్తావు. ఇంకోడు ఇకిలిస్తాడు...”

“ఏయ్”—అంటూ మహోద్రేకంలో బూటుకాలితో తన్నాడు: “అబ్బా!”—అంటూ విరుచుకొని పడిపోయి, బాధతో మూల్గాడు మోరల్.

“అసంభవం” యుద్ధభూమి దద్దరిల్లేటట్లు అరుస్తూ మొదలుపెట్టాడు కెప్టెన్. “నేను చావటమా!.... వీరాధివీరుణ్ణి...నన్ను జయించగలసమర్థులున్నారా? ...మిమ్మల్ని హతమారుస్తాను...”

“ఏదీ యింతమందిని చంపుతున్నావే– ఒక్కణ్ణి బ్రతికించు. చచ్చేవాళ్ళను; బ్రతికించటానికిబదులు, బ్రతికేవాళ్ళను చంపటంకాదు మానవపరమావధి. దైవసృష్టిని విచ్ఛిన్నం చేయడమేనా నీ ఆదర్శం.”—అన్నాడు మోరల్.

“అయితే నువ్వెందుకు చేస్తున్నావు?”—

“కేవలం పొట్టకోసం. ఆకలితో చావలేక యుద్ధంలో చద్దామని బయలుదేరాను.”

“అమ్మో!...”—అంటూ ఆర్తనాదం వినిపించింది. వెనుదిరిగి చూచాడు. బ్రతికున్న మనిషే... కదల్లేక పడిఉంటే, ఏదో రాంబందు పీకింది.

“చూస్తున్నావా”—మోరల్ ఆ అవకాశాన్ని పురస్కరించుకొని మొదలుపెట్టాడు. “జీవికి శరీరంమీద మోహం చెప్పరానిది. బ్రతికున్నంతవరకు ప్రతివాడికీ, చర్మం కప్పబడ్డ యీ రక్తమాంసాలు...యీ ఎముకలగూడుమీద మమకారం ఎంతో ఉంటుంది. అబ్బ!...నాలుక పీక్కుపోతోంది. కాసిని మంచినీళ్లు పోద్దూ. చూడు, బ్రతికున్నవాడిమీద నీకు పగ. చచ్చే నామీద నీకు శత్రుత్వం దేనికి...”

“నిన్ను రక్షించడమా! శత్రుసైనికుణ్ణి బ్రతికించటమా!”

“ఎవరి కెవరు శత్రువులు?”—ప్రశ్నించాడు మోరల్.

"మీరు మాకు శత్రువులు"—అన్నాడు కెప్టెన్ ఎర్నెష్టు.

"చాలా పొరబడ్డావు. నువ్వొక దేశపువాడివి. నేనొక దేశపువాడిని. నువ్వెవరో నాకు తెలియదు. ఎక్కడివాడవో అంతకంటే తెలియదు. నా ముఖం నువ్వు గాని, నీ ముఖం నేనుగాని ఏనాడూ చూచుకో లేదు. నీకు నేను ఏమి అపకారం చేశాను. పోనీ నావల్ల నీ సంసారాని కేమైనా హాని చేకూరిందా. నేనెల్లా శత్రువు నయ్యాను?"— అని అడిగాడు మోరల్.

"కట్టిపెట్టు నీ కుంటికూతలు. మీ దేశానికీ, మా దేశానికీ మధ్య శత్రుత్వముంది."—అన్నాడు కెప్టెన్.

"అదే నే నడుగుతున్నాను. నీకూ నాకూ పగ లేదని నువ్వే ఒప్పుకున్నావు. నా సంసారానికీ, నీ సంసారానికి మధ్య ఏలాంటి పగా లేదు. నా ఊరి వాళ్ళకు...నీ ఊరివాళ్ళకు శత్రుత్వం లేదు. ఎలా ఉంటుంది; ఎవరి కెవరు ద్రోహం చేశారని. మొత్తం మీద యిలా చూచుకుంటే నీ దేశప్రజ మధ్య, నా దేశ ప్రజ మధ్య అసలు వైరమే లేదు. కాని దేశాల మధ్య ఉంది. ఈ ప్రజకు సంబంధించని ఆదేశా లెక్కడున్నాయి. విధిననుసరించి మనం యుద్ధం చేసున్నాం. గానుగకు కట్టిన ఎద్దుల్లా తయారుచేశారు. దేనికోసం యింతమంది చస్తున్నారు. పవిత్రమయిన యిందరి రక్తంద్వారా సాధించే ఆ మహాత్కార్య మేమిటి? ...కాస్త చెప్పవూ?"—రాను రాను ఆయాసం విసరి కొడుతోంది. ప్రాణాలు కడబడుతున్నాయి. అతని శరీరం ముందుకు వెనుకకు ఊగుతోంది. కొందు జలద రిస్తోంది. బహుశా తీవ్రంగా జ్వరం కాస్తూఉండ వచ్చు.

కెప్టెన్ ఎర్నెష్టు బాధ ఎలా ఉంటుందో ఎరుగనివాడు. చుట్టూ చూచాడు. వికృతంగా, పిశాచాలు నృత్యంచేస్తూన్నట్లుందా ప్రదేశం.

మోరల్ మొదలుపెట్టాడు. "కాసిని మంచినీళ్లు పొయ్యవోయ్!...ఇస్నా!...నీ భుజంమీది ఆవాటరు బాటిలు చూస్తూంటే, మరింత దాహ మేస్తోంది. ఆహ్! ...కాలుపోయిందికదూ?...రక్తం...యీ చేతిలోని ఎముకలన్నీ విరిగిపోయి ఉంటాయి. ఓహ్!....బాధ అపారంగా ఉంది. కాని ఏంచేయను." కాసేపు మూలిగాడు. అతని తలకూడా వాలిపోతోంది. "నీళ్లు"—అంటూ పెదవులు నాలుకతో తడిపాడు. "మంచినీళ్లు. ఊహ్! [దగ్గాడు] కాసిని మంచినీళ్లు పొయ్యవూ?" — అంటూ క్రింది పెదవి చప్పరిస్తూ చాలా దీనంగా జాలిగా అన్నాడు. వాలిపోయేతలను బలవంతంగా ఎత్తుతూ, అతికష్టంగా అన్న ఆఖరు మాట "దేముడంటూ ఒకడున్నాడు..."—అంతే. పడిపోయాడు.

తల తిరిగిపోయింది ఎర్నెష్టుకు. చుట్టూ అనేక శవాలు—కీచురాళ్ళధ్వని. నక్కలకూతలు.

ఆ శ్మశానంలో ఆ నిశ్శబ్దవాతావరణాన్ని చీల్చుకుంటూ ఏవేవో వింత ధ్వనులు వినవస్తున్నాయి. ఎవరో నవ్వుతున్నట్లుంది; కాదు వెక్కిరిస్తున్నారు; కాదు కర్తవ్యాన్ని బోధిస్తున్నారు.

కెప్టెన్ గబగబా మోకరిల్లాడు. మీది వాటరు బాటిలు తీసి మోరల్ నోట్లో వంచేశాడు. తడారిపోయిన గొంతు—నీళ్ళధాటి కాగలేక కంగున దగ్గి భొళ్లున కక్కాడు.

చేతులు దులుపుకుంటూ లేచాడు కెప్టెన్. ఎక్కడినుంచో "ఎటెన్షన్"—అని పిలిచినట్టుగా విన్నాడు. అలాగే నిలచి "లెఫ్ట్—రైట్"—కదలకుండా కదం త్రొక్కాడు.

చుట్టూ చూచాడు. ఎవ్వరూ లేరు. వికలాంగులైన శవాలు కనుపించాయి. ఇటు తిరిగాడు. దూరాన్న ఆకాశం, భూమి కలుసుకుంటున్నాయి. అంతంతదూరంగా కనుపించే ఆకాశం భూమీకూడా కొంతదూరంలో కలుసుకుంటాయి కాబోలు!

చేతిలోని వాటరుబాటిల్ను బూటుకాలితో తన్నాడు. అల్లంతదూరాన పడ్డది. క్రింద చూచాడు. ఓ వ్యక్తి జీవన్మరణ సంధ్యలో ఉన్నాడు. బహుశా అయిపోయే ఉంటాడు.

గబగబ రెండుచేతుల్లోకి తీసుకున్నాడు. ముందుకు సాగాడు. అస్తమించే సంధ్యార్కుని పసిడి కిరణాలు అతని నుదుటిపైనా, ఉరస్సుపైనా పడి తళుకు తళుక్కున మెరుస్తున్నాయి.

ప్రకృతికూడా స్తంభించిపోయింది.

*　　*　　*　　*

ఆ రాత్రి తెల్లవార్లూ ఆ వీరవరుడు. ఆ సైనికుణ్ణి తన భుజాన వైచుకొని అలానే తీసుకొనిపోతున్నాడు. మోరల్ శరీరమంతా క్రాగిపోతోంది. ఉలిక్కిపడుతున్నాడు. ఏదేదో కలవరిస్తున్నాడు.

"చూడమ్మా!...యుద్ధం ఎంత ప్రమాదకరమైనదో! అలా అంటావేమమ్మా, మారణాయుధాల ముందు మనయ్యేటప్పుడు, పిల్లలేమిటి, పెద్ద లేమిటి, ఆడవారేమిటి, మొగవారేమిటి, ముసలివారేమిటి— అంతా ఒక్కటే. మృత్యువుకు ఆ తేడా లేదమ్మా! ......అవునమ్మా!......ఇంట్లో కూర్చుంటేమాత్రం ప్రాణానికి హామీ ఏముంది?...ఎలాగైనా చావు తప్పదమ్మా! పోతానమ్మా, పోతాను. అన్నం నీళ్లూ లేకుండా ఇలా అల్లాడుతూ చావడ మెందుకమ్మా! అలానైనా చస్తాను పాప మేమిటమ్మా. ఎంతమందిని చంపితే అంత పుణ్యం. చావటం చాలా తేలికమ్మా. ఇట్టే చంపెయ్యవచ్చును. ప్రాణానికి విలు వేమిటమ్మా.

"కొట్టండి...అటు...పేల్చు.... కాల్చు........ అబ్బా!......"

"తమ్ముడూ!"—అంటూ కౌగలించుకున్నాడు —కెప్టెన్ అతన్ని.

తెల్లవారుఝామున మోరలుకు తెలివి వచ్చింది. ఎవరో తనను ఎక్కడికో ఎత్తుకొనిపోతూ ఉన్నట్టు గ్రహించాడు.

"ఎవరు?...ఎవరు నన్ను తీసుకొనిపోయేది?"

సమాధానం రాలేదు.

"ఎవరు...?"—అరచాడు మోరల్.

"ఆఁ." అస్పష్టంగా అన్నాడు ఎర్నెష్టు. బహుశా అప్పటికి వినిపించి ఉండాలి.

"నువ్వా?"—ఆశ్చర్యపడ్డాడు మోరల్.

"అబ్బా!...వళ్లెంత వెచ్చగా ఉంది. బాగా జ్వరం తగిలింది."—ఏదో అంటున్నాడు కెప్టెన్ ఎర్నెష్టు.

భయపడ్డాడు మోరల్. "నన్నెక్కడకు తీసుకొని పోతున్నావు?మీవాళ్ల అందరిముందూ పెట్టి—ఈ అవిటివాణ్ణి—ఈ కాలూ చెయ్యి లేనివాణ్ణి—నన్నెందుకు హింసిస్తావు. నన్ను క్షమించు. నీ కడుపున పుడతాను. నీదగ్గరున్న ఆ పిస్టల్‌తో నన్నిక్కడే కాల్చివేయి..."

"నన్ను క్షమించు తమ్ముడూ!"—అన్నాడు కెప్టెన్. "అయినా ఒక క్రూరుడిలో హఠాత్పరివర్తన కలిగినా అనుమానానికి తావు లేకుండా ఎలా పోతుంది."—అని అనుకున్నాడు.

"చూడు. నేను నీకేం అపకారం చేయను. నా మాట నమ్ము. నీవాళ్ళదగ్గరకే నిన్ను తీసుకొనిపోతున్నాను."

"నిజంగానా!... నేను నమ్మను"—అన్నాడు మోరల్.

"చూడు. ఇందాక వినున్నావు. 'దేవుడంటూ ఒకడున్నాడు' అని నువ్వనలేదూ, ఆ భగవంతుడు సాక్షిగా చెబుతున్నాను. నన్ను విశ్వసించు."

"అన్నా!..." ఎలా అభినందించాలో తెలియక, కృతజ్ఞతాపూర్వకంగా ఆమాట అన్నాడు మోరల్.

"మీఅమ్మదగ్గరకు నిన్ను చేరుస్తాను. నన్ను సరిగా నువ్వు అర్థంచేసుకోవడంలేదు. నేను ఏది నిజమని నమ్మితే దాన్ని చేసితీరుతాను. అప్పుడు నా ప్రాణాలనుకూడా నేను లెక్కించను. హాస్పిటల్లో చేర్చి నీకాలు, నీచేయి బాగుచేయిస్తాను. మీవాళ్లందర్ని నీకు చూపిస్తాను. వాళ్ళను చూడాలని నీకు లేదూ?..."

"అవును. ఉంది."—అన్నాడు సైనికుడు.

చిన్నగా నవ్వాడు కెప్టెన్.

మోరల్ తన జీవిత చరిత్రను సంగ్రహంగా చెప్పటం మొదలుపెట్టాడు. "నీకు తెలుసా? నువ్వెవరినైనా ఎప్పుడైనా ప్రేమించావా? చూడు — కొందరు ప్రేమిస్తారు. కాని ఏంలాభం? అనుభవించే యోగ్యత ఉండవద్దూ!

చిన్నతనంనుంచీ నేనూ, 'లిల్లీ' కలిసిమెలసి మసలేవాళ్లం. లిల్లీ—అంటే నా ప్రేయసికి నేను పెట్టిన పేరు. మా స్నేహం, ప్రేమగా పరిణమించింది. ఒకర్ని ఒకరు ఎంతో యిదిగా చూచుకునేవాళ్ళం. కాని ఆరోజులన్నీ వేరు. అవన్నీ అమాయకంగా అజ్ఞానంలో దొర్లిపోయాయి. కన్ను తెరచి చూచేసరికి మేం ప్రపంచంలో పెద్దవాళ్ళమయి కూర్చున్నాము.

లిల్లీ తన ప్రేమనంతా నాముందు గుమ్మరించేది. పేదతనానికి ప్రేమకు చాలా తేడా ఉంది. లిల్లీని నేను ప్రేమిస్తున్నాను. లిల్లీ నాకు కావాలి. లిల్లీతో కలిసి కాపురంచేసి జీవితాన్ని రెండుచేతులా జుర్రుకుందామని ఉండి. కాని.... కాని.... ఎట్లా?

ఇంట్లో గడిచే ఎత్తు లేదు. పొట్ట చేత్తోబట్టుకుని వీధులవెంట పడ్డాను. ఉద్యోగంకోసం తహతహలాడిపోయాను. ఎవరు నాకు దిక్కు?

దినం గడిచేవిధంలేని పేదవాణ్ణి. ఇంట్లో రోజూ కుండలు దొర్లుతున్నాయి. పేదరికం ప్రళయతాండవం చేసే నాకొంపలో...అనారోగ్యం .... అసౌఖ్యం... అశాంతి—ఎన్ని ఉండాలో అన్నీ ఉన్నాయి. ఏం చేసేది?

ఒక యుద్ధంలో నా తండ్రి పోయాడు. మరో యుద్ధంలో నా అన్న పోయాడు. ఈ యుద్ధంలో నేనూ పోతున్నాను. నా యింట్లో మగవాడనే వాడు మిగలకుండా మిగిలిన నేనూ పోతున్నాను."— దుఃఖంతో అతను క్షణంసేపు మాట్లాడలేకపోయాడు.

"తిన తిండిలేక పస్తులున్న రోజులనేకం ఉన్నాయి. నాకు మిగిలింది నా తల్లి, నా లిల్లీ. వాళ్లిద్దర్నీ పోషించలేకపోయాను. నాకా ఉద్యోగం, సద్యోగం లేదు. వేరే ఆదాయం అంతకంటే లేదు. వాళ్ళిద్దరూ అన్నహారాలు లేక కృష్కించిపోతున్నారు. కడకు తెగించాను. మృత్యువు నాహ్వానించాను. నా తల్లిని...నా ప్రేయసిని......ఈ విశాల ప్రపంచానికి వదిలేసి, మిలిటరీ రిక్రూట్‌మెంటు లారీ ఎక్కాను." అతని కిక మాట పెగల్లేదు. కొంతసేపు గడచిపోయింది.

తేరుకొని మళ్ళీ మొదలుపెట్టాడు:— "ఆ ఒక్క రోజు, రేపు మిలటరీలో చేరబోయే రోజు...నా జీవితం సార్థకమయిన దినం...

"ఆ సాయంకాలం నేనూ, నా లిల్లీ, చెట్టాపట్టాలు వేసుకొని తిరిగాం. నదీతీరంలో ఒక చక్కని సైకత స్థలంలో కూర్చుని సుఖస్వప్నాలను నిర్మించుకున్నాం. మామిడిగున్నల కావల, తాటితోపుపక్కన ఆ రెండు కొండల మధ్య అస్తమించే ఆ సూర్యదేవుని బంగారుకాంతుల్ని ఆనందంతో అవలోకించాం. రివ్వగాలికి రేగిన చిన్నచిన్న కెరటాలపై తేలియాడే నీటిబుడగ లగుపించాయి. నీటి తుంపరలతో వీచే గాలి, మత్తెక్కించింది. ప్రఫుల్ల వదనారవిందంతో ఆ రమణీయ ప్రకృతిని వీక్షించాం. ఉదయిస్తున్న ఆ పున్నమ చంద్రుని తిలకించాం. మినుకు మినుకుమనే తారకాసందోహం తీయని వాంఛల్ని మాలో రేకెత్తించింది.

"ఉద్రేకంలో మైమరచి నేను పాడాను... నేను బాగా పాడతాను. ఆనందంతో నా ప్రేయసి నాట్యం చేసింది. నా ప్రేయసి బాగా నాట్యం చేస్తుంది.

"అంతే!..." చాలా నీరసంగా, నిస్పృహగా అన్నాడు. గట్టిగా గాలి పీల్చి వదలేశాడు.

తరువాత కొంతసేపటికి యిలా అన్నాడు:— "నా తల్లినీ, నా ప్రేయసినీ ఒక్కసారి చూడాలి. నా తల్లి ఒడిలో తనివితీరా నేను పడుకోవాలి. నా ఒడిలో నా ప్రేయసి పడుకుంటుంది. ఇద్దరూ నా ముఖంలోకి దీనంగా, జాలిగా, బాధగా చూస్తూ వుంటారు. అలా వాళ్ళను చూస్తూ యీ ప్రాణాల నొదిలేస్తాను.

"నా తల్లిని చూడాలి. నా ప్రేయసిని పలుకరించాలి. అంతే నాకోరిక. నా కెవరిమీదా ద్వేషం లేదు. నా కెవరూ శత్రువులు లేరు. కేవలం పొట్టకోసం యుద్ధంలో చేరాను. కేవలం పొట్టకోసం...."

అంతే. మోరల్ మరి మాట్లాడలేదు. ఆఖరి మాటలు చెబుతూంటేనే అతనికి స్మృతి తప్పిపోయింది. కెప్టెన్ ఎర్నెష్టు భుజంమీద తల వాల్చేశాడు.

"తమ్ముడూ!...." అంటూ కౌగలించుకున్నాడు ఎర్నెష్టు. "మళ్లీ నీకు మతితప్పిపోయిందా! ఇంత సేపూ నీదేవూరో నే నెందుకు కనుక్కోలేదు. నిన్ను నే నెక్కడకు చేర్చాలి. మాటలసందర్భంలో ఆమాటే మరచిపోయాను.

"చిన్నప్పుడు నాకూ తల్లిఉంది. ఆవిడ నేనంటే పంచప్రాణాలు వదలేది. ఇప్పుడు నా కర్థమవుతోంది — మాతృప్రేమ ఎంతటిదో మాటలతో చెప్పటం కష్టమని. క్షణం ఆలస్యంగా నే నింటికి వస్తే నాతల్లి ఎంతో గాబరాపడిపోయేది. కాని... కాని...నా కాభాగ్యం లేకపోయింది. నాతల్లి నన్ను విడిచిపోయింది. అంతే!

"నేనెవర్నీ ప్రేమించలేదు. నా కేస్త్రీ సతీ లేదు. యౌవనాంకురాలు తలెత్తేటప్పటికే నేను మిలటరీలో చేరిపోయాను. కనుపించిన ఆడదాన్ని బలవంతంగా కౌగలించుకొని కామతృష్ణ తీర్చుకున్నాను.

"మానవకళేబరాలను ప్రేమించాను. ప్రాణాలతో చెలగాటలాడాను. అబ్బా! ... ఎంతమంది నీలాటి అమాయకులను,—తల్లీ, భార్యలనుంచి వేరుచేసి — వారి రక్తాలను చవిచూచాను? ఎంతమంది ప్రాణాలను బలిపుచ్చుకున్నాను? ఘోరం నాయనా! నేను కటికవాణ్ణి; గొర్రెల్ని చంపినట్లు చంపటమే కాని, వాటిమీద ప్రేమ నాకేనాడూ లేదు. నేను రాక్షసుణ్ణి.

"ఓహో! ఇతనికి స్పృహ లేదుకదూ! ఎవరికి చెబుతున్నాను ఎందుకంటున్నా నీమాటలు ..." ఉద్వేగంతో నడక హెచ్చించాడు — కెప్టెన్ ఎర్నెష్టు.

మసక ముసురుకుంటోంది.

*    *    *    *

"డాక్టర్! ఇతణ్ణి బ్రతికించండి. మీ కెంత కావాలంటే అంత యిస్తాను. ఇతను చావకూడదు. చావటానికి వీల్లేదు." — ఆదుర్దాగా, ఆవేశంలో అనేస్తున్నాడు డాక్టరుతో ఎర్నెష్టు.

"తొందరపడితే ఎలా? అన్నీ కట్లు కడతాను. కాని రక్తమంతా పోయింది—" డాక్టరుమాట పూర్తయినా కాలేదు.

"నా రక్తమిస్తాను కానివ్వండి."

అవ్వాళ్లా ఆ సైనికునికి తెలివి రాలేదు. కెప్టెన్ కండ్లలో వత్తులు వేసుకొని చూస్తున్నాడు. డాక్టరుని తొందరపెట్టి క్షణక్షణం తీసుకొచ్చి చూపిస్తున్నాడు.

"చూడు. ఇతనికి నయమవుతుంది; నయం కాకపోతే నా డాక్టరుగిరీ వదలుకుంటాను. నాకు బాగా నమ్మకముంది. భగవంతునిమీద ప్రమాణం చేసి చెబుతున్నాను." భరోసా యిచ్చాడు డాక్టర్.

"అలా వట్టు వేసుకోకండి డాక్టర్! నా ఆదుర్దాలో అలా అడుగుతున్నాను."—బాధగా అన్నాడు ఎర్నెష్టు.

"ఇప్పుడేం గొడవ చేయకు. మళ్ళీ వస్తాను"— డాక్టరు వెళ్లిపోయాడు.

కెప్టెన్ రక్తమంతా సైనికునికి ఎక్కించబడ్డది. ఆ సాయంకాలం ఆ సైనికుడు ఆ ప్రక్కనుంచి యీ ప్రక్కకు వరిగాడు. ఒక్క నర్సు తప్ప మరెవరూ సైనికునిదగ్గర ఉండటానికి వీలులేకపోయింది. రాత్రి గడచిపోయింది.

తెలతెలవారుతోందనగా అతను కలవరించటం మొదలుపెట్టాడు:—"చూడు లిల్లీ!........రేపటినుంచీ నేను సిపాయిని. ఏదీ—ఒక్కసారి "సిపాయి!"— అంటూ పిలు."—ఇలా ఏవేవో అంటున్నాడు.

ప్రక్క గదిలోని నెలరోజుల బాలింత ఎవతో ఇతని మాటలు వింటోంది. కొన్ని ప్రత్యేక కారణాలవల్ల ఆవిడ అక్కడ ఉండటానికి అనుమతి యివ్వబడింది. ఇలాంటి గొంతు ఆవిడ ఎక్కడో విన్నది-కాదు—చిరపరిచితమైనగొంతు. ఎవరితను?- అని అనుకున్నది. గొంతుమాదిరి గొంతు ఉండకూడదా? ఏమో ఒకవేళ అతను తన ప్రియుడే కాకూడదా? అయినా ఒక్కసారి చూస్తే ఏం పోయింది. అతనే అయితే ఎంత బాగుంటుంది. బాగుండడం మాట సరే—అతను కావద్దూ! లేచింది.

ఆ సైనికుడికి బాగా తెలివి వచ్చింది. కళ్లు విప్పి నాలుగు పక్కలా చూచాడు. అతనెక్కడుంది అతనికే అర్థం కాలేదు. లేవబోయాడు. కాని, కాలూ చెయ్యీ లేదు. అంతా ఏదో వింతగా అగుపించిందతనికి. తను సిపాయి. అవును. యుద్ధంలో కాలు విరిగిపోయింది; చేతి ఏముకలన్నీ నజ్జయ్యాయి. నిజమే. తానిక్కడకెలా వచ్చాడు. ఎవరో తనను మోసుకుని వచ్చినట్లు గుర్తు. అవును. శత్రుదేశపు సైనికుడొకడు మోసుకొని వచ్చాడు. అయితే యిప్పుడు తనెక్కడున్నాడు? అబ్బే! బుర్ర ఏంపనిచేయటం లేదు. ఏం గుర్తుకు రావడం లేదు.

ముఖ్యవిషయం కెప్టెన్ ఎర్నెష్టును ఎవరూ గుర్తుపట్టలేదు. మోరల్ మాత్రం అతణ్ణొక శత్రుదేశపు సైనికుడుగా తలపోస్తున్నాడు. నిజం దాగి ఉంది. ఎప్పుడు బయటపడుతుందో చెప్పలేం.

ఇంతలో నర్సు వచ్చింది. ఆవిడను చూచిన తరువాత కొంతసేపటికి బుర్ర పనిచేయగా చేయగా,

తనున్నది ఒక హాస్పటలని గ్రహించాడు. అప్పుడా శత్రుదేశపు సైనికుడు (కెప్టెన్ ఎర్నెష్టు) అన్న మాటలు గుర్తుకొచ్చాయి:—నిన్ను హాస్పటల్లోచేర్చి నీకాలూ, చేయి నయం చేయిస్తాను."

"ఇదిగో, యీమందు పుచ్చుకోండి"—అంటూ యిచ్చింది నర్సు. త్రాగాడు.

"కాసేపు విశ్రాంతిగా పడుకోండి'—అంటూ వెళ్ళిపోయింది. కాని "నర్స్" — అంటూ పిలిచాడాసైనికుడు. ఆగింది.

"ఇక్కడకు నన్నెవరు తీసుకొనివచ్చారు?"— అడిగాడు.

"ఎవరో సైనికుడు. అతనెవరో నాకెలా తెలుస్తుంది. రోజూ అనేకులు వస్తూంటారు; పోతూంటారు" - అన్నది.

"అతన్ని కొంచెం పిలుస్తావ్?"—అన్నాడు.

"సరే"—నంటూ నర్సు వెళ్లిపోయింది. మలుపు తిరిగేటప్పుడు ఆప్రక్కగదిలోని అమ్మాయి ఆపింది: "మాడమ్మా! నువ్వాప్రక్కగదిలోంచే కదూవస్తూంట" అని అడిగింది.

"అవును. ఏమమ్మా! ఏం కావాలి"—మృదువుగా అడిగింది నర్సు.

"ఆగదిలో ఉన్న దెవరమ్మా?"

"ఎవరో సైనికుడు"

"అత నెవరమ్మా"

"నాకెలా తెలుస్తుంది. తెలుసుకోవలసిన అవసరం మాకుండదుకదమ్మా. డాక్టరుగారు చెప్పింది చేయటం మావంతు" — నవ్వుకుంటూ వెళ్లిపోయింది నర్సు.

ఆ అమ్మాయి రెండడుగులు ముందుకు వేసింది. గది గుమ్మందాకా వచ్చి తొంగిచూచింది. ఆ సైనికుడు ముఖం అటు త్రిప్పుకొని పడుకున్నాడు. అతనేదో తెలివిగా ఉండే అనుకుంటున్నాడు. రానురాను ఆసైనికుడు యీ అమ్మాయి పేరే ఉచ్చరిస్తున్నాడు. ఈ అమ్మాయిహృదయం దడదడ కొట్టుకుంది. అతను తప్పకుండా తన మోరల్ అయిఉండాలని నిశ్చయించుకుంది.

"సిపాయి"—పిలిచింది.

"ఎవరు?"—అంటూ యిటు తిరిగా డతను.

"సిపాయి!"—

"లిల్లీ!"

అంతే! ఒకరి కౌగిలిలో ఒకరుండిపోయారు. ప్రపంచాన్ని ఆ కొద్ది క్షణాలు వారు మరచిపోగలిగారు. ఎన్నో రోజుల (వాళ్ల దృష్టిలో ఏండ్లు) తరువాత యివ్వాళ కలుసుకున్నారు. మధురతరమైన యిలాంటి సమాగమంకోసం అహర్నిశలు నిరీక్షిస్తున్నారు. "నీ కాలేది?...నీ చేతి కిదేం కట్టు" అని లిల్లీ, "మా అమ్మ ఎక్కడ?"—అని మోరల్ ఒకరి నొకరు అడుగుదా మనుకుంటారు. ఆ మైకంలో, ఆ పిచ్చిలో అడుగలేకపోతున్నారు. ఆ క్షణం స్తబ్ధులై ఉండిపోయారు.

వచ్చాడు కెప్టెన్ ఎర్నెష్టు. సైనికుడు పంపిన కబురందిం దతనికి. గుమ్మంలో అడుగుపెట్టాడు. ఈ దృశ్యం చూచి నిశ్చేష్టుడై నిలుచుండిపోయాడు. అతని బుర్రలో ప్రపంచం గిర్రున తిరుగుతోంది. తలుపువారగా, గోడ కావలప్రక్క కూలబడిపోయాడు— స్తబ్ధుడై.

"మా అమ్మ!...ఎక్కడుంది"—మాటలు కూడగట్టుకుంటూ అడిగాడు మోరల్. "చెప్పు లిల్లీ!"...

కెప్టెన్ ఆశ్చర్యంతో ఒకసారి యిటు చూచి ముఖం తిప్పివేశాడు.

"చెప్పవేం లిల్లీ! మా అమ్మ క్షేమంగా ఉంది కదూ?"

"ఆవిడ...లే...దు."

"ఆఁ...నిజంగానా! చెప్పు లిల్లీ!"

"అవును. ఆవిడ వెళ్లిపోయింది."

"అమ్మా!" అతని హృదయంలో దుఃఖ సముద్రం పొంగి పొరలింది. భోరున ఏడ్చా డతను. అతని దుఃఖంచూచి, కెప్టెన్‌కుకూడా కళ్ళు చెమర్చినాయి.

ఎవరిని తను చూడాలనుకున్నాడో, ఎవరిని మనసారా పదేపదే పిలవాలనుకున్నాడో, ఎవరు తనకు ప్రాణసమానమో, ఎవరికోసం తనింతగా తహతహలాడిపోతున్నాడో, ఎవరి ఒడిలో పడుకొని, తను ప్రశాంతంగా చచ్చిపోదా మనుకుంటున్నాడో... ఆవిడ ఏది? ఆవిడ లేదు...లేదు...అబ్బా!...

"ఇలా అయిందేం లిల్లీ! మా అమ్మ నన్ను విడిచి ఎందుకు వెళ్ళిపోయింది? నా గురించి కలువరించిందికదూ! నాకోసం ఆఖరు నిమిషంవరకూ చూచింది కదూ! నాకోసం... చెప్పు లిల్లీ!..."

"ఏం చెప్పేను?"

"చెప్పక? ఎలా చచ్చిపోయింది?"

"నువ్వు మిలిటరీలో చేరిపోయావు. కాని అలా చేయటం ఎవరికీ యిష్టంలేదు. మమ్మల్ని సుఖపెడదామని, మా కష్టాలుచూడలేక నువ్వు కష్టాలపాలయ్యావు. కడకు ప్రాణాలను బలిదానం చేయటానికి సిద్ధపడ్డావు."

"అయితే సిపాయిగా చేరటం తప్పా?"... అయోమయంగా అడిగాడు మోరల్.

"మామయ్య ఉండగా ఎప్పుడూ ఏమనేవాడు జ్ఞాపకంలేదూ? దేశరక్షణకోసం, దేశ భద్రత కాపాడటం కోసం ప్రాణాలొడ్డటం ప్రతివాడి కర్తవ్యం. దేశంలో అరాచకం తలెత్తకుండా, అశాంతి రేగకుండా, శాంతి అహింసలు నెలకొల్పడంకోసం ప్రతివాడు మిలిటరీలో చేరాలి. కాని—"

"నువు చెప్పింది నిజం లిల్లీ!...మానవమారణహోమం చేయటంకోసం మనిషి జన్మ ఎత్తలేదు."

"మరునాటినుంచీ ఇల్లు గడవటం మహా కష్టమయింది. ఏం చేయాలి? ఎలా పొట్టగడుస్తుంది? మనింటి విషయం నీకు తెలియందికాదు. దేశంలో యుద్ధంవస్తే వచ్చేవాడికి డబ్బు వస్తుంది. బాగుపడేవాడెవడో బాగుపడతాడు. అంతంత మాత్రపు మనబోటి వాళ్లు ఆకలిదేవతకు ఆహుతైపోతారు.

"అన్నిటి ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఎలా జీవించగలం. జీవన్మరణసమస్యలో పెనుగులాడే సంసారాల్లో మన దొకటైంది. ఆడవాళ్ళం. ఏం చేస్తాం. ఎన్ని ఉపవాసాలున్నామో ఎవరికి తెలుసు.

"అత్తయ్య ఆ ముసలితనంలో ఆకలితో... వ్యాధితో...నీమీది బెంగతో మంచం పట్టింది.

"ఆ పరిస్థితుల్లో ఏం చేయను. మందూ మాకూ ఎక్కడినుంచి తెచ్చిపోసేను. గాలిలో వెలుగుతోంది దీపం. గాలి తగులకుండా ఎన్ని వేపులనుంచి కాపలా కాసేది. కడకా దీపాన్ని గాలి ఆర్పివేసింది..."

"అమ్మా!..." అంటూ ఏడ్చాడా సైనికుడు. ఇంత నికృష్టంగా తన తల్లి చనిపోయిందని విని ఘోషించాడు. అతగాడు తనకీ ప్రపంచంలో ఇహ ఏమీ లేదన్నట్లు భావించాడు. అతి ప్రియమైనవారు తననుంచి వేరుచేయబడ్డారు. తను ఉండేం?... లేకేం?...

చాలా సేపు గడచిపోయింది.

*  *  *  *

"నా చెల్లెలు 'రోజా' జ్ఞాపకముందా మోరల్? గులాబిపువ్వులా సుందరంగా ఉంటుంది దాని ముఖమని 'రోజా' అని పిలచేవాడివి. రోజా దానితో వేళాకోళం ఆడేవాడివి. ఎంతో చిలిపి పిల్ల. అయితే రోజా ఏం చేసిందో తెలుసా?

"అత్తయ్య మంచంలో మ్రగ్గిపోతోంది. అన్నం లేక అల్లల్లాడిపోతున్నాము. అమ్మకు తిందామన్నా ఏమీ లేదు. ఎలా సంపాదించాలో తెలియనివాళ్లం.

"ఈ ఆకలితో నేను చావలేను. ఈ నికృష్టస్థితి నేను చూడలేను. అత్తయ్య అలా జీర్ణించిపోవడానికి వీల్లేదు" అంది.

"ఏం చేస్తాం"—అన్నాను.

"ఏదో ఒకటి చేయాలి."—అన్నది.

"ఏమిటి చేయడం?"

"ఏమిటి మనం చేసిన పాపం? ఎందుకు మనకీ నరకం?..."

"చెల్లీ!"— గాద్గదికంగా అన్నాను నేను.

"జీవితంతో పోరాడాలి. మీ కందరికి అన్నం తెచ్చిపెడతా చూడండి..." అంటూ ఉద్రేకంతో పరుగెత్తింది.

"చెల్లీ!...చెల్లీ!!..." నా మాటలు వినిపించుకోలేదు.

"మూడు రోజుల తరువాత తిరిగి వచ్చింది. తిరిగి వచ్చింది నువ్వనుకున్న రోజా కాదు. భయంకర పిశాచి. పాతకి...దాన్ని తిట్టదలచుకోలేదు. ఎవరి కర్మ కెవరు కర్తలు. 'ఇది తప్పు—ఇది ఒప్పు'— అని నిర్ధారించేది మనం; మన మనస్సులు. ఈ తప్పొ

ప్పులు కూడా మన మనస్సుల ననుసరించి ఉంటాయి. ఒకరికి తప్పుగా తోచింది—మరొకరికి ఒప్పుగా తోచవచ్చు. మన భావన ననుసరించి యివి మారు తూంటాయి. రోజా చేసిన పని రోజా ఒప్పుగానే భావించింది. ఆఖరి క్షణంవరకు 'నేను తప్పు చేయ లేదు'—అంటూ ఆక్రోశించింది. కాని మా దృష్టిలో దాని పని తప్పుగా కనుపించింది.

"దానిదగ్గరకు పోతే గప్పున వాసన కొట్టింది. బాగా త్రాగి తూలుతోంది. చేతిలో డబ్బుసంచీ పట్టు కుంది.

"ఆ పరిస్థితిలో దాన్ని చూస్తూంటే నాకు పరమ అసహ్యమనిపించింది. దవడలన్నీ పీక్కుపో యాయి. ముఖమంతా పాలిపోయింది. అందంగా అగు పించటంకోసం కృత్రిమంగా అలంకరించుకుంది. దాన్నిగురించి నే నేమీ వర్ణించదలచుకోలేదు. జరిగిన విషయం చెబుతాను. విను:

"తీసుకొచ్చిన డబ్బు నా ముందు పెట్టింది:—"అత్తయ్యకు మందు యిప్పించు. అన్నం అదీ వండు కొని హాయిగా తినండి"

"నాకు అరికాలిమంట నెత్తికెక్కింది. అదెట్లా సంపాదించిందో నే నిట్టే ఊహించాను. అందుకే ఆ డబ్బు విసరికొట్టాను. దాని ముఖాన విసరికొట్టాను"—ఈ మాటలు చెబుతూంటే కోపంతో లిల్లీ ముఖం కందగడ్డలా ఎరుపెక్కింది.

"ఎక్కడిదీ డబ్బు? చెప్పవేం?"—అంటూ కసురుకున్నాను.

"ఎక్కడి దేమిటి?—" అన్నది రోజా.

"ఇంత డబ్బు!...ఇది న్యాయంగా సంపాదిం చింది కాదు"—

నవ్వింది రోజా:—"ఆడది తలచుకుంటే ఎంత డబ్బు అయినా సంపాదించగలదు." క్షణంసేపాగి మళ్లీ మొదలుపెట్టింది:—"వాడెవడో వెధవ, బాగా తాగి వచ్చాడు. ప్రేమట!....ప్రేమ!...వాడి బొంద. ఉద్రేక మెచ్చింపట, వళ్లు మరచిపోయి డొక్కలో బూటుకాలితో తన్నాడు. నిజంగా ప్రక్క ఎముకలు విరిగిపోయా యనుకున్నాను. కాసేపయిన తరువాత 'అయ్యో!'—అంటూ ఇంత డబ్బు పారేశాడు. తలొక రకం ప్రేమా చూపిస్తారు. వట్టి పశువులు...

"అది ఇట్లా మాట్లాడుతుందని అనుకోలేదు. ఇంతగా మారుతుందని ఎవరనుకుంటారు. అలా మాట్లా డుతూ ఉంటే వళ్లు తెలియని కోపం వచ్చింది. కోపో ద్రేకంలో నన్ను నేను మరచిపోయాను. (లిల్లీ గొంతు కోపంతో వణుకుతోంది) ఆకొన్న సింహంలా మీద పడిపోయాను. రోజా రెండు చెంపలమీదా ఎన్నో వేల దెబ్బలు కొట్టాను. రిమ్మ ఎత్తిపోయిఉండాలి. కాని రోజా కదల్లేదు. కండ్లు మూసుకొని, తలపైకెత్తి చేతులు వెనక్కు కట్టుకొని నిలుచుంది. కొట్టి, కొట్టి అలసిపోయాను నేను. దాన్ని చూస్తుంటే రోతపుట్టు కొచ్చింది. అంతులేని కోపం వచ్చింది. భరించలేని ఏడుపు వచ్చింది.:—'వెళ్లవతలకు'—కాని రోజా కదల్లేదు.

"కొట్టటం అయిపోయిందా! కొట్టకొ కొట్టు. నువు వళ్ళు మరచిపోయావు. కొడుతున్నావు. పిచ్చిదానివి. నీ పరిస్థితి నేను గ్రహించాను. నాకంటే పెద్దదానివి. లేకుంటే...ఎందుకులే......"

"ఇక్కడకు రావటానికి, నాకు మొహం చూపించటానికి నీ కెల్లా సిగ్గులేకపోయింది."

"సిగ్గ!...ఎలా ఉంటుందది."

"ఛీ!...వెళ్ళవతలకు..."—కోపంతో అనే శాను.

రోజా అంది:—"వెళుతున్నాను. కాని నే నెందుకు సిగ్గుపడాలి. నేను ఏం తప్పుపని చేశానని. మోహంతో చేశానా? ... కామంతో చేశానా? ప్రేమతో చేశానా? మాట్లాడవేం? యమబాధ భరించ లేక చేశాను. ఒక్కరోజు కడుపునిండా తిండిలేదు; వంటినిండా గుడ్డలేదు నాకూ హృదయ ముందక్కా! నాకూ కోరికలున్నాయి, ఆశలున్నాయి, ఆశయా లున్నాయి. అన్నిటికీ మొహం వాచిపోయాను. నాలుగురోజులు ఆనందంగా గడుపుదామనుకున్నాను. హాయిగా ఉందామనుకున్నాను. బావా, నువ్వూ నేను అందమయినదాన్నని అంటూ ఉండేవారు. ఆ అందం నా కక్కరకొచ్చింది.

"ధర్మపన్నాగాలు కాదు కావలసింది—న్యాయం. మీరు ఎంత నీచంగా నన్ను చిత్రించు తున్నా, నాకేం బాధలేదు. నేను చేసింది తప్పుకాదు. ఇది తప్పు అని చెప్పే పెద్దమనిషి ఉంటే ఇట్లా

రమ్మను. అతన్నిలా అడుగుతాను—గుండెమీద చెయి వేసుకొని చెప్పండి, మీ రెన్ని దారుణ దురంతాలు చేశారు. మీరు చేసిన తప్పుడు పనులవల్ల ఎంతోమంది నాశనమౌతున్నారు. కాని నా తప్పుకు నేనే నాశనమవుతున్నాను. ఈ ప్రపంచంలో ప్రతివాడూ చేసే తప్పుకంటె నాది బహు స్వల్పమైంది. కేవలం స్వార్థంతో చేశాను. ఆకలితో అటుపటించలేక బ్రతకటంకోసం చేశాను. అది తప్పెలా అవుతుంది?

"నే నెవర్నీ ప్రేమించలేదు. నే నెవరికీ ద్రోహం చేయలేదు. నాకు నేను చేసుకున్నాను. నన్ను నేను మోసపుచ్చుకున్నాను. వీధుల్లో యీడ్చి పారవేసే దిక్కు కూడా లేకుండా యీ నీచపుముండ చస్తుందని కదూ అనుకుంటున్నావు. ఎవడో ఒకడు దారి కడ్డని సైడుకాలవలోకి యీడ్చి పారేస్తాడు.

"నాకు చావంటే భయం లేదక్కా. ఇన్నాళ్లూ చావుబ్రతుకుల సమస్యలో జీవించాను. చావంటే భయం పోయింది. ఇప్పుడు బ్రతుకుతున్నాను. ఇష్టం లేకపోతే చస్తాను."

క్షణంసేపు మౌనంగా గడచిపోయింది. ఎవరూ ఎః తోనూ మాట్లాడలేదు. ఆఖరికి రోజా అంది:—

"పోనీలే అక్కా! నాగురించి నువు బాధపడకు. కాని ఒక్కటిమాత్రం గుర్తుంచుకో—నే నీ పని చేసేటప్పుడు నా హృదయంలో ఎంత కుమిలిపోయానో, నీకు నా ముఖం చూపించటానికి ఎంత బాధపడ్డానో నీకు తెలియదు. నే నిప్పుడొక రోగాలపుట్టని. ఆశ్చర్యపడకు. నా హృదయం విప్పి చెప్పనీయి. కాని నాగురించి నే నేమీ బాధపడటం లేదు. అవ్వన్నీ మరచిపోవడానికి చిత్తుగా తాగుతాను. మత్తుగా ఏ మురికికూపంలోనో పడుంటాను. నా ముందు కనకవర్షం కురుస్తోంది. ఇది తాత్కాలికం కావచ్చు. కాని యీ ప్రపంచంలో శాశ్వత మేమిటి?

"ఇదిగో డబ్బు. తీసుకో. నీకు భవిష్యత్తు కావాలి. నేను చెడిపోయాను. ఎవరైనా బాగుపడటం మంచిదికదూ? కనీసం బావ వచ్చేంతవరకు మీరు బ్రతకటం అవసరం. నాకోసం కాకపోయినా, నామీద ప్రేమ లేకపోయినా, డబ్బుమీది ప్రేమతో తీసుకో. ఇంకా కావలిస్తే నాకు కబురుచేయి. వస్తానక్కా! నన్ను ఏవగించుకుంటున్నావని నాకు తెలుసు... నామీద నీ దృష్టి అలా ఉండటమే మంచిది. వెళతాను...క్షమించు...ఈ రోజాను మరచిపోకు.—"

అంటూ గుడ్లనీరు క్రుక్కుకుంటూ పరుగెత్తింది. ఎన్నో పిలుపులు పిలచాను. వినిపించుకోలేదు. "అత్తయ్యా!"—అంటూ అత్తయ్యమీద పడి వలవల ఏడ్చాను.

రోజా తప్పుచేయ లేదంటుంది.

*　　*　　*　　*

"కొన్నాళ్ళకు ఈ ప్రదేశాన్నంతా 'A' దేశం జయించింది"—అంటూ చెప్పుతోంది చరిత్రగమనం లిల్లీ: "సైనిక కోలాహలంతో ధరిత్రి దద్దరిల్లిపోయింది. ఎక్కడివాళ్లక్కడ పారిపోయారు. పోలేనివాళ్ళు మిగిలిపోయారు. ఇళ్లు, పశువులు, ఆస్తిపాస్తుల నన్నిటిని వదలివెళ్ళారు. కఠిన కర్కశ హృదయుడైన ఆ దేశపు కెప్టెన్ కొల్లగొట్టాడు. అకస్మాత్తుగా ఆక్రమించాడు."

కెప్టెన్ ఎర్రని ష్టువల్లు జలవరించింది. లిల్లీ మొదలుపెట్టింది:—"కాని ఎందరెన్ని దిశలకు పరుగెత్తుతారు. ప్రళయాగ్నిజ్వాలల మధ్య చిక్కుకున్న కీటకాలలా మాడిపోయారు. ఆ కెప్టెన్ గ్రామమంతా దగ్ధపటలం చేశాడు. ఆస్తులన్నీ దోచుకున్నాడు. అందర్నీ హతంచేయించాడు. స్త్రీలనందర్నీ—" లిల్లీ చెప్పలేకపోయింది.

"లిల్లీ!"—అన్నాడు గోముగా మోరల్.

"ఆఁ..."

"యుద్ధంవల్ల మానవత్వం నశిస్తుంది."

"అవును మోరల్! ఎవరైనా ఏదైనా చేయాలని చేస్తే పాపం అవుతుంది. కాని క్రూరంగా, ఘోరంగా హింసించి ఆ పాపపంకిలంలోనికి ఏ వ్యక్తినయినా దింపితే ఆ పాపానికి బాధ్యత ఆ వ్యక్తి దవుతుందా?"

"నాకేం అర్థం కావటం లేదు." అన్నాడు మోరల్. లిల్లీ చెప్పటమా? మానటమా? అన్న సంశయంలో పడ్డది. మోరల్ మళ్లా హెచ్చరించాడు: "చెప్పు లిల్లీ! భయపడకు. తరువాత?"

"తరువాతనా! అలా ఆ కెప్టెన్ పురుగు లేకుండా ధ్వంసం చేయించాడు. స్త్రీలంతా సైనికుల చేతుల్లోపడి దారుణంగా హింసింపబడి మానాలు

పోగొట్టుకున్నారు. ఆ పాపానికి వాళ్లు బాధ్యులా మోరల్.

"అప్పుడేం జరిగిందో తెలుసా? నవయౌవ్వనం తొణికిసలాడుతూ, చంద్రుణ్ణి ధిక్కరించే చిన్నది—ఆ కెప్టెన్ కళ్ళల్లో పడ్డది. బాగా విను. అతి ముఖ్య విషయం"—ఆగింది.

కెప్టెన్ ఎర్నెస్టు సుమ్మంలో కూర్చోలేక పోతున్నాడు. ఆ దారుణాల కన్నిటికీ కారణం తను. ఆమె చెప్పబోయే విషయం అతని కవగాహనయింది.

లిల్లీ మొదలుపెట్టింది:- "అత డామెను బలాత్క రించాడు. కాని ఆమె చీత్కరించింది. మస్తుగా త్రాగి, వళ్లు తెలియని స్థితిలో, అత డామె గదిలోకి, ఒకనాటిరాత్రి ప్రవేశించటం జరిగింది: భీతహరిణిలా అతని బాహుపంజరంలో పెనగులాడింది. కాని అత డామెచుట్టూ తన రెండుచేతులతో యినుపకోట కట్టాడు.

*   *   *   *

"తెల్లవారినుంచీ ఆమె కమితమర్యాదలు. కెప్టెన్ ఉంపుడుకత్తెమీద అందరికీ అభిమానం. అవిడంటే భయం. అవిడ చుట్టూ అనుక్షణం యీ సైనికుల కాపలా ఉంది. ఆవిడ చచ్చిపోదామనుకుంది. కాని చావటానికి కూడా వీల్లేకపోయింది.

"ఇంకా బ్రతికిఉన్నాను మోరల్. ఆ పాపానికి ఫలితంగా ఓ కొడుకును కని యీ పాడుముఖం నీకు చూపించటానికి ఇంకా జీవించే ఉన్నాను—" అంటూ ఆత్మకథ చెప్పుకొని ఆమె భోరున ఏడ్చింది.

"లిల్లీ!...ను...వ్వా...!!"—అప్పుడతని పరిస్థితి ఎలా ఉందంటే చెప్పటం కష్టం.

కెప్టెన్ ఎర్నెస్టు భరించలేక లేచాడు. వెళ్ళిపోవటానికి నిశ్చయించుకున్నాడు.

"నన్ను నీ కసితీరా నీ చేతులతో యీ గొంతు నులిమేయి మోరల్. నీ చేతుల్లో మరణించటంకంటే నాకింకేం కావాలి. ఈ పాపాన్ని తుడిచేయి. నన్ను, నా బిడ్డని చిత్రహింస చేయి. కానియ్యి..." అంటూ అతని కాళ్ళముందు పడింది.

మోరలుకు ఏం చేయటానికీ తోచలేదు. ఏం చేస్తాడు? "లిల్లీ! ఇలా జరిగిందేం లిల్లీ!..." అతను శూన్యంలో చేతులు తడుముకున్నాడు. ముఖం తుడుచుకున్నాడు. చాలాసేపు ఆకాశంకేసి చూస్తూ ఉండిపోయాడు. లిల్లీ నేలకేసి చూస్తూ కూలబడి ఉంది. కెప్టెన్ అడుగు ముందుకు పడలేదు. అత నింతవరకు అక్కడ ఉన్నది వీళ్లకు తెలియదు. తలుపు కావల ప్రక్క ఉన్నాడాయె!

"నేను దోషిని!...పాపిని..." ఆవిడ ఉద్రేకంతో జుత్తు పీక్కుంటోంది.

"లిల్లీ!"—మోరల్ హృదయం కరిగిపోయి లాలనగా అన్నాడు.

"నేను మహాపాపిని. ఎన్నాళ్లినుంచో నిన్ను చూడాలనుకుంటున్నాను. నీ హృదయంలో తల నుంచుకొని అలా శాశ్వతంగా నిద్రపోవాలనుకుంటున్నాను. నా కామాత్రం సహాయం చేయ్యవ్? చేయవూ?..."

"లిల్లీ! నువ్వు దోషివి కావు. నా ప్రేయసివి."

"ఆఁ...కాదు, కాదు"—

"అవును లిల్లీ!"—అంటూ అత డామెను తన వంటి చేత్తో హృదయానికి చేర్చుకున్నాడు. తలలో అతని వ్రేళ్లు పోనిచ్చాడు. ఆవిడ జుత్తు దువ్వుతున్నాడు:—"మాడు లిల్లీ! నువ్వు పాపం చెయ్యాలని చేయలేదు. నీ శరీరం పాపానికి గురిఅయింది. కాని నీ ఆత్మ పరిశుద్ధమయింది. ప్రేమ ఆత్మానుగతమైంది. శారీరకమైంది కామం. మనమధ్యఉన్నది ప్రేమ. నేననుభవించేది అనుభవించాలనుకున్నది నీశరీరాన్ని కాదు. నిర్మలమైన,నిష్కల్మషమైన నీహృదయాన్ని.ఏదిలిల్లీ! ఇలా నావడిలో పడుకో. చెప్పలేం ఎప్పుడేం జరుగుతుందో? అప్పుడు ఆ నదీసైకతస్థలంలో ఎప్పుడూ పాడే నీఆ పాట ... మధురాతిమధురమైన స్వరంతో పాడి నన్ను తన్మయుణ్ణి చేయి. సైనికుణ్ణయి హృదయాన్ని చంపుకున్నాను. చిగురింపచేయవూ?

ఆమె పాడుతోంది. ఉద్రేకంతో అతనిమీద వాలి ఆతని పరిష్వంగంలో సర్వానుభూతుల్నీ అనుభవిస్తోంది. ఆవేదనతో ఏడుస్తోంది. అతని హృదయం ఆమెపాటకు లయ కలుపుతోంది.

కెప్టెన్ ఎర్నెస్టు చరచర వెళ్ళిపోయాడు.

ఎంతసమయం అలా దొర్లిపోయిందో గమనించినవా రెవ్వరూలే రక్కడ.

కాని నర్సు తన డ్యూటి నెరవేర్చుకోవడానికి వచ్చింది.

*    *    *    *

"అతన్ని తీసుకొని పోతున్నారు"—అంటూ చెప్పింది నర్సు. ఆదుర్దా ఆమెలో కనుపిస్తోంది.

"ఎవర్ని?" — అంటూ ప్రశ్నించారు లిల్లీ మోరల్ ఒకేసారి.

"అదే. నిన్ను తీసుకొనివచ్చి యిక్కడ చేర్చి నతన్ని."

"ఎవరతను?"—లిల్లీ అడిగింది.

"మానవుడు" — అంటూ లేచాడు మోరల్. ప్రక్కనే ఉన్నకర్ర భుజం క్రిందికి లాక్కున్నాడు. గుమ్మంలోకి లిల్లీతోవచ్చి సైనికులు కట్టి తీసుకు పోతున్న క్టెపెన్ను చూచాడు. లిల్లీ కెవ్వున కేక వేసింది.

"ఏమిటిది?ఎందుకలా వణకిపోతున్నావు?"—అంటూ ఆదుర్దాగా అడిగాడు మోరల్ లిల్లీని.

"అతను మానవుడుకాదు. దానవుడు."

"ఏమిటే నువ్వంటున్నది లిల్లీ?"

"అవును మోరల్! ఈ దారుణాలన్నిటికీ మూల కారకుడు"

"అతనా!"—ఆశ్చర్యపడ్డాడు మోరల్.

గొలుసులతోకట్టి తీసుకొనిపోతున్నారు కెప్టెన్ ఎర్నెష్టును, 'B' దేశపు సైనికులు.

గుందంలో కూలబడిపోయాడు మోరల్. అతని మనస్సంతా ఆలోచనలతో నిండిపోయింది:— "ఏమిటిది? అతనేనా నా సంసారాన్ని నాశనం చేసింది—నా ఊరు శ్మశానం చేసింది!"

అతని పనంతా అయోమయంగా ఉంది. అతను తన ప్రాణాలు కాపాడ్డంకోసం అతని ప్రాణాలు బలిదానం చేస్తున్నాడు. రక్షించటమా! కాని ఎలా? ఛీ! ఇన్ని దుర్మార్గాలు చేసినవాణ్ణి రక్షించటమా? అసంభవం. కాని...

నర్సు మళ్ళీ వచ్చింది. "మీరు విశ్రాంతిగా పడుకోవాలి. ఈ మందు త్రాగండి."

త్రాగాడు. పోతూపోతూ లిల్లీని పలుకరించింది నర్సు:— "పాప ఏడుస్తోంది. మీ గదిలోకి వెళ్ళరా?"

"వెళతానమ్మా!...ఇప్పుడే వెళతాను."

నర్సు చెప్పింది:—"ఇది మీకు తెలుసా? కెప్టెన్ ఎర్నెష్టు కనబడటంలేదని, ఉన్న పళంగా మాయమైపోయాడని 'A' - దేశం గగ్గోలెత్తిపోతోంది."

"ఏమయ్యాడు?"

"ఇప్పుడు మనకు దొరికింది అతనేనట." అని నర్సు వెళ్లిపోయింది. మోరల్ హడలిపోయాడు.

"ఏమల్లా చెదరిపోతున్నావు?"

"కెప్టెన్ ఎర్నెష్టు అంటే ఎలాంటివాడో నీకేం తెలుసు? అతనంటే 'A' దేశం పడి చస్తుంది. శత్రుభీకరుడు. అతనేవైపు యుద్ధానికి బయలుదేరితే ఆ వైపువారు ఎంత బలాఢ్యులైనా, ఎంత జిత్తులమారివారైనా హడలి చస్తారు. అతని కెదురు నిలవటం భయంకరమైన తుఫానును చింకిచాపతో ఆపటం లాంటిది. కాని అతనేనా యితను..."

*    *    *    *

వరండాలో మిలిటరీబూట్ల శబ్దం రానురాను హెచ్చయింది. 'B' - దేశంలోని కెప్టెనులలో ఒకరైన కెప్టెన్ వెనమ్ వచ్చాడు. అతని అసలు పేరు ఎవరికీ తెలియదు. కాని అంతా కెప్టెన్ వెనమ్ (విషం) అని పిలుస్తారు. అనుచరుడు ఫాక్సు వెంట ఉన్నాడు. ఫాక్సు కెప్టెన్ వెనమ్‌కు దక్షిణ హస్తం.

మోరల్ లేచి మిలటరీ సాల్యూటు చేయబోయాడు. కాని కెప్టెన్ వెనమ్ కల్పించుకొని:— "లేవకు. కూర్చో" దగ్గరేఉన్న కుర్చీని ఇటులాగాడు. ఫాక్సు కెప్టెన్ వెనమ్ కూలబడ్డాడు. అతని లావుపాటి శరీరం కూలబడేసరికి కుర్చీ కిర్రుమని కదలిపోయింది. బానలాంటి పొట్ట. చెయ్యెత్తు మనిషి. డబ్బాలో రాళ్లు వేసినట్లు గలగలలాడే బొంగురు గొంతు:—'చూడు. నీ కతనితో పరిచయం ఎలా కలిగింది?"

"ఏమన్నారు?"—తిరిగి అడిగాడు మోరల్.

"అతను నిన్నిచ్చటకు తీసుకొని వచ్చాడు. అట్లా అతను నిన్ను యిక్కడకు తీసుకొని రావడానికి కారణం—నీకూ, అతనికి సంబంధం ఉండిఉండాలని మేం అనుకుంటున్నాము."

"మీరేమేమో అనుకుంటున్నారు. నేనతనికి తెలియదు. అతను నాకు తెలియదు"—అన్నాడు మోరల్.

"అయితే ఏం సంబంధమూ లేకుండా నిన్నతను ఇక్కడ చేర్చాడని నమ్మమంటావు? అంతేనా!—" అన్నాడు కెప్టెన్ వెనం.

"ఇలాంటి విషయాలు నమ్మించటం కష్టం. యుద్ధంలో నేను పడిపోయాను. ఈ కాలు, యీ చేయి పోయాయి. ఆర్తత్రాణపరాయణుడైన ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తూ అలా పడి ఉండిపోయాను. చాలా సేపు...ఎంతసేపో......అలా ఉన్నాను. స్పృహ లేదు.

"స్పృహ వచ్చేసరికి నా పరిస్థితి అవగతమయింది. తెగిన కాలులోంచి యింకా రక్తం చిమ్మకొట్టుతోంది. తల తిరుగుతోంది. దాహంతో నాలుక పిడుచగట్టుకొనిపోయింది. మృత్యువు సమీపించిందని నిశ్చయించుకున్నాను.

"అప్పుడు...అప్పుడు ఇతనక్కడకు వచ్చాడు. జాలిగా ప్రార్థించాను. భగవంతుడు నా కనుకూలుడయ్యాడు. అతను మారాడు. తరువాత ఏం జరిగిందో నాకయోమయంగా ఉంది. ఇక్కడున్నాను. నాకంతే తెలుసు..."

"మంచిది"—అన్నాడు కెప్టెన్ వెనం. "నీవల్ల దేశానికి చాలా మేలు చేకూరింది. నీ సహాయానికి మాతృదేశం ఋణపడి ఉంది; నిన్నభినందిస్తోంది. నీకు స్వాంతం నయమయ్యేవరకు ప్రత్యేకంగా సకల సౌకర్యాలు సమకూరుస్తాం."—కెప్టెన్ వెనం వెళ్ళిపోతూ ఇతన్నిగురించి డాక్టరుకు గట్టిగా చెప్పివెళ్ళాడు.

నర్సు వచ్చింది. ఇప్పుడు మాత్రం అతి జాగరూకతతో ప్రవర్తిస్తోంది. సంభాషణలో కూడా మార్పు వచ్చింది.

"సార్! మందు పుచ్చుకునే టయమయింది"

మందు త్రాగాడు. ఆమెలో అంకురించిన మర్యాదకు, నమ్రతకు మోరల్ ఆశ్చర్యపడ్డాడు. క్షణక్షణం ఆసుపత్రి అంతా అతన్నిగురించి అతిశ్రద్ధ వహిస్తోంది. అతను ఆజ్ఞ యివ్వటం తడవుగా పరిపాలింపబడుతోంది.

తెల్లవారింది. మోరల్ మాత్రం నిద్రపోలేదు. అతని హృదయమంతా ఉద్రేకంతో ఉడుకెత్తిపోయింది. ఆలోచనాప్రవాహతరంగాలు ఒకదాని తరువాత ఒకటిగా పొర్లిపోతున్నాయి. తల దిమ్మెక్కింది.

తన సంసారాన్ని నాశనంచేసినఅతన్ని ఎందుకు క్షమించాలి. తనలాగా అతనుకూడా యిన్నిబాధలు అనుభవించితీరాలి. "పగ తీర్చుకుంటాను"—అంటూ లేచాడు. కర్ర భుజం క్రింద పెట్టుకుని చరచరా సాగిపోయాడు. నర్సు అడ్డు వచ్చింది. "సార్! తమరు కదలటానికి వీల్లేదు." లాభం లేకపోయింది. లిల్లీ ఏమో చెప్పబోయింది. వినుపించుకోలేదు.

*   *   *   *

కెప్టెన్ వెనం తన సహచరులతో ఆలోచనలో పడ్డాడు. శత్రుదేశపు గుట్టు మట్టులు తెలిసికోవడం గురించి మథన జరుగుతోంది. శత్రుదేశంలో మారణహోమపుపరికరా లెక్కడ తయారవుతున్నాయి. ఏమూల, ఏభూగర్భప్రదేశంలో ఉత్పత్తిచేస్తున్నారు. ఎక్కడ బాంబులువేసి నాశనంచేయాలి. ఈయావత్ సృష్టినీ నాశనంచేయగల మహాశక్తివంతములైన ఆయుధాలు ఎక్కడ తయారుచేస్తున్నారు? కాని, వీ రాసించినట్లు ఎన్నెష్టువద్దనుంచి సరైన సమాధానం రావడంలేదు.

"ఎట్లా...ఎట్లా తెలిసికోవడం"—విసుగెత్తిపోయి ఉద్రేకంతో అరచాడు కెప్టెన్ వెనం.

"నేను ప్రయత్నిస్తాను"—అంటూ ప్రవేశించాడు మోరల్. అంతా ఒకరిముఖాలు ఒకరు చూచుకున్నారు. అంతా అనుమానపడుతున్నారని నిశ్చయించి మోరల్ మళ్లీ అందుకొని యిలా అన్నాడు "నమ్మటంలేదుకదూ!"

"ఎందుకు నమ్మటంలేదు"—అన్నాడు వెనమ్.

"మరయితే ఎందుకలా చూస్తున్నారు నాకేసి. నన్ను విశ్వసించండి. వాడు నాకు శత్రువు"

"అవును. వాడు మనకు శత్రువు"

"మీసంగతి నాకు తెలియదు. నాకు పరమశత్రువు. పగ తీర్చుకుంటాను." పళ్లు పటపట కొరుకుతూ, ఉద్రేకంతో అరచాడు మోరల్. దగ్గ తెరకమ్మింది. అందరి బుర్రలు ఆలోచనలో పడ్డాయి. తేరుకొని మోరల్ అన్నాడు:—"మీకు తెలుసా?

నా ఊరును స్వాధీనంచేసికొని యిండ్లన్నీ తగులబెట్టించాడు. అంతా శ్మశానం చేశాడు. ఆస్తులన్నీ దోచుకున్నాడు.

"వీడివల్ల నాతల్లి, నా ప్రేయసి అష్టకష్టాలనుభవించారు. నా యిరుగు పొరుగు నాశనమయ్యారు. బంధుమిత్రులంతా నశించారు. (కంఠం రుద్ధమయింది) నవమాసాలు మోసి, కని పెంచిన నా తల్లి, నామీద పంచప్రాణాలు పెట్టుకున్న ప్రేమైక స్వరూపిణి, ఆ పవిత్రమూర్తి ఆకలితో, వ్యాధితో, బాధతో అటమటించి అంతమొందింది. నా ప్రేయసిని, నా హృదయాధిదేవతను బలవంతంగా..." ఉద్రేకంగా "వీడు చేసిన పనులు యిన్నీ అన్నీ కావు. విజయగర్వంతో విర్రవీగిపోయి, వివేచనాజ్ఞానశూన్యుడై యిష్టమొచ్చినట్లు నాట్యం చేశాడు; చేయించాడు. ప్రతీకారం చేసి పగతీర్చుకుంటాను. ఇన్ని పరాభవాలూ అతనికి జరగాలి. వాడి ప్రేయసిని వాడిముందు క్రూరంగా ఘోరంగా అనుభవించాలి. తీర్చుకుంటాను పగ... హా హ్హా హ్హా హ్హా..." కండ్లు తిరిగి గిర్రున పడిపోయాడు.

కెప్టెన్ వెనం మోరల్ దగ్గరకు గబగబా వెళ్లాడు. తగిన ఉపచర్యలతో సేద తీరుస్తున్నాడు. ప్రతివారి ముఖానా ఏం జరుగుతుందో అనే ఆదుర్దా అగుపిస్తోంది.

కెప్టెన్ వెనం కొంత స్వస్థత చెందటానికి అవకాశం దొరికింది. ఎందుకంటే మోరలును అడ్డుపెట్టుకుని యితనిద్వారా ఆ దేశపు రహస్యాలు తెలుసుకోవచ్చు. ఈ దెబ్బతో అతని పరాక్రమం లోకానికి విదితమౌతుంది. శత్రుదేశపు గుండెను చీల్చబోతున్నాడు. కొన్ని సంవత్సరాలుగా ఎవరూ తెలుసుకోలేని రహస్యాన్ని తెలుసుకోనబోతున్నాడు. అంటే వారి మారణాయుధాల సృష్టినే నాశనం చేయబోతున్నాడు. అందరికంటే ముందే అతనీ పని చేయటానికి సంకల్పించుకున్నాడు. అవసరమైతే ప్రాణాలొడ్డటానికి కూడా సిద్ధపడుతున్నాడు.

అప్పుడు...అప్పు డెవరినోట విన్నా అతని పేరే చెప్పుకుంటారు. అతణ్ణి అద్వితీయ దేశభక్తునిగా ఆరాధిస్తారు. ఆ గొప్పతనమంతా అతనికే దక్కాలి.

కెప్టెన్ వెనం ఆలోచనలకు ఫాక్సు అడ్డు తగిలాడు:—"ఇంత ఉద్రేకంలో ఉన్నాడు మోరల్. ఇతనేం సమాచారం తెలుసుకుంటాడు..."

"అలా అనకు. ప్రతీకారవాంఛ ఇతనిలో బాగా రేకెత్తింది. ఆ అవకాశాన్ని మనం ఉపయోగించుకోవాలి...అన్నాడు కెప్టెన్ వెనం.

వెనం అనుమానపడ్డాడు!—"చుట్టూ కాపలా ఉంటే యితనేం అడుగుతాడు—అతనెలా చెబుతాడు"—

"అయితే ఒంటరిగా పంపుదామా? అక్కడ ఏం జరిగిందో మన కెలా తెలుసుంది."

"అదే నేనూ ఆలోచిస్తున్నాను."

"వీళ్ళకు కనుపించకుండా వీళ్ళ ననుసరిస్తాను"

"మంచి ఉద్దేశ్యం"—అన్నాడు వెనం.

* * * *

మిలటరీ గుడారాల్లో ఒకదాన్ని జైలుగా మార్చారు. అందులో బంధించబడ్డాడు కెప్టెన్ ఎర్నెష్టు. చీకటింకా బాగా అలుముకోలేదు. చందమామ రావటానికింకా కొంచెంసేపు కావాలి. సూర్యాస్తమయానికి, చంద్రోదయానికి మధ్య జరిగే సంఘర్షణాసమయం. ప్రతివస్తువునూ బాగా చూడటానికి సరిపడ్డ కాంతి ఉంది.

ఆ జైలులోకి కర్రమోపుకుంటూ, ఉన్న ఒకే ఒక కాలు యీడ్చుకుంటూ నడచాడు మోరల్. ఒక మూలగా నక్కి తొంగిచూస్తున్నాడు ఫాక్సు. పశ్చిమాభిముఖుడై తదేక దృష్టిగా చూస్తూ కూర్చున్నాడు ఎర్నెష్టు. అస్తమించిన తరువాత మిగిలిన ఆ రెండు కొండల్నే చూస్తున్నాడో, లేక యింకా మిగిలిన రక్తకిరణసందోహం, మేఘశకలాలపై మెరసే ఆ తళుకునే అవలోకిస్తున్నాడో, చెప్పలేం. రెప్ప వాలటం లేదు.

వెనుకగా ప్రవేశించాడు మోరల్. అతని కర్ర చప్పుడవుతూనే ఉంది. ధ్యాననిమగ్నుడై యున్న ఎర్నెష్టు అతని రాక గమనించలేదు. చేతులు వెనక్కు విరిచి కట్టబడ్డాయి. చేతులకు, కాళ్ళకు మెదలటానికి వీల్లేకుండా సంకెళ్లు వేశారు.

మోరల్ అతన్ని క్షణంసేపు చూస్తూ నిలబడ్డాడు. తనొక పనిమీద వచ్చాడు. ఓ కార్యం సాధించాలి. అందుకే నియమితుడయ్యాడు. ఇవన్నీ మరచిపోయాడు. ప్రతీకారవాంఛ తిరోగమించింది. అతనిలోని మానవత్వం పెల్లుబికింది. అదరి దద్దటిల్లే

టట్లు "అన్నా!"—అంటూ అరచాడు. కళ్ళవెంట నీళ్లు రాలిపడ్డాయి.

గభాలున వెనక్కి తిరిగాడు ఎర్నెస్టు. మోరల్‌ను చూట్టం తడవుగా:—"ఎలా ఉంది వంట్లో" అని ప్రశ్నించాడు.

మోరల్ యిదేమీ వినిపించుకోలేదు. తన్ను గురించి ఆలోచించుకోలేదు!—"అదేమిటి? గోళ్ళ నిండా ఆ రక్త మేమిటి? వీపునిండా ఆ దద్దు లేమిటి? ఏమి టివన్నీ?—" భయంతో బేజారై పోయాడు. గొంతు బొంగురుపోయింది; వణకింది.

"నీ కాలు, నీ చేయి అలా ఎందుకయ్యాయి చెప్పవ్?"—

నిబ్బరంగా అన్నాడు ఎర్నెష్టు. వాక్యంతో గంభీరంగాను, ముఖం ప్రశాంతంగా చిరునవ్వుతో తొణికిసలాడుతోంది.

మోరల్ చలించిపోయి అతని కాళ్లమీద పడి పోయాడు.

ఎర్నెష్టు గోముగా అన్నాడు: — "కూర్చో. నువ్వల్లా పడిపోతే నాకెంతో కష్టంగా ఉంది. కూర్చోవూ? నా కాళ్లు, చేతులు కట్టారాయెను— నిన్నెల్లా కూర్చోబెట్టేది."

"ఇదంతా ఏమిటి?—"

"గుంజకు విరిచికట్టి కొరడాలతో కొట్టారు."

"ఆఁ..."

"చేతులవేళ్ళనిండా కాళ్ళవేళ్ళనిండా గుండు సూదులు దింపారు......"

"అబ్బా" — భోరున ఏడ్చాడు మోరల్. మెత్తనిహృదయం మంచులా గబగబ కరగిపోయింది.

"ఇంకా—"

"ఇహ వద్దు. ఎందుకు యిలా చేస్తున్నారు. కారణం?"

"యుద్ధం"—ఒకటేమాట అన్నాడు ఎర్నెష్టు.

"శత్రువనా?"

"అదీ ఒక కారణం కావచ్చు."

"అసలు కారణం చెప్పవ్?"

"ఏముంది మా దేశంలో మారణాయుధాలు ఎక్కడ తయారయేదీ చెప్పమంటారు. తెలిస్తే నిజంగా చెప్పిఉండేవాడినే. అవన్నీ ఒక్కసారి భస్మమయితే యుద్ధం ఆగిపోయేది. ప్రజ బ్రతికి పోయేవారు..." అన్నాడు ఎర్నెష్టు.

"నేను దుర్మార్గుణ్ణిఅన్నా! నావల్లకదూ, నువ్విన్ని బాధలు పడాల్సి వచ్చింది."

"నానుంచి నువ్వు, నీ సంసారం అనుభవించిన దానికంటేనా? నావల్ల ఎంతమంది హింసింపబడ్డారు. నువ్వు నాకు మహోపకారం చేశావు. నీ సంపర్కం నాకు కలుగనినాడు ... ఎంతోమందిని చంపుతూ ఉండేవాడిని. ఎన్నో ఊళ్లు కాల్చి పారవేస్తూ ఉండే వాడిని. ఎంతమంది ఆస్తులనో సోల్జర్లు దోచుకుంటూ ఉండేవారు. ఎంతోమంది స్త్రీలను బలాత్కారంగా—" ఆగాడు. ఊపిరి పీల్చుకొని తాపీగా మొదలు పెట్టాడు:—నీవల్ల నాలో ఎక్కడో అణగారిపోయిన మానవత్వం పెల్లుబికింది; నేను చేసిన ద్రోహాలన్నిటియొక్క ఫలితం నా కండ్లముందు చూచాను. ఒకనాడు మానవుడు మానవుణ్ణి చంపటం ధీరత్వం, శూరత్వం అని తలచాను. కాని ఆ మానవుడు చనిపోయినతరువాత అతని సంసారానికి కలిగే తీరని నష్టాన్ని గుర్తించలేదు; అతని సంసారం ఎన్ని బాధ లనుభవిస్తుందో గమనించలేకపోయాను. వెలువడిన ప్రతి గుండు చంపేది ఒక మనిషినేకాదు! అతన్ని అంటిపెట్టుకున్న యింకా అనేకమందిని."

నిశ్శబ్దత సాగిపోతోంది. కొంతసేపు ఎవరూ మాట్లాడలేదు. మోరల్ ఏదో మాట్లాడబోయాడు. కాని ఎర్నెష్టు అందుకున్నాడు:—"నువ్వు చెప్పిన విషయాలన్నీ యిందాకటినుంచీ మననం చేస్తున్నాను. ఎవరి కెవరు శత్రువులు? ప్రజమధ్య వైరంలేదు, దేశాలమధ్య ఉంది. ఎక్కడున్నా యీ దేశాలు? దేశమంటే ప్రజ కాదా? బుద్ధిపూర్వకంగా మానవుడు యితరులను చంపుతున్నాడా? ప్రాణా లరచేతిలో పెట్టుకొని పోరాడాల్సిన అగత్య మేమొచ్చింది. ఎవరో కొద్దిమంది వ్యక్తులకోసం యింతమంది చావటమా?...

"అన్నా!..." అన్నాడు మోరల్.

"ఏవిఁటి?"

"మనం యిక్కడినుంచి వెళ్ళిపోదాం."

"పారిపోవడమా?"—అన్నాడు ఎర్నెష్టు.

"కాదు. ఈ మహామృత్యు కరాళగహ్వరంలో నుంచి తప్పించుకుందాం..."

"తప్పించుకుని"—

"మీ దేశం పోదాం."

"మా దేశమా?" — నవ్వాడు ఎర్నెష్టు— "చూడు? మీ దేశమొస్తే నన్నేం చేశారు? మా దేశంపోతే నిన్నదే చేస్తారు. పైగా నాకో రెండు మెడల్సు...నాలుగు బిరుదులు...ఛీ!..."

మోరల్ మెత్తటి హృదయం ఘోషించిందంటే నమ్మరేమో! పడే బాధలు తప్పించుకోవడమే కాకుండా, వచ్చే గౌరవమర్యాదలను కూడా కాలదన్నుతున్నాడంటే ఎంతటివాడి హృదయమైనా నీరైపోతుంది.

"ఇంకెక్కడికైనా పోదాం."

"ఎక్కడికి?..."

"ఎక్కడైతే యుద్ధంలేదో అక్కడకు. ఏ దేశం శాంతి నాకాంక్షిస్తున్నదో ఆ దేశం. ఎక్కడైతే జీవితానికి స్వస్థత, స్వేచ్ఛా వున్నాయో...అక్కడికి పోదాం."

"అయినా—" మెల్లగా అందుకున్నాడు ఎర్నెష్టు "నాకు జీవించాలని కోరిక లేదు. ఎందుకంటే యీ భయంకరపిశాచం యింకా జీవించి ఉండటం మంచిది కాదు. సర్వ విధ్వంసానికీ కారకుణ్ణయిన నేను ... నేనే దేవుణ్ణని విర్రవీగాను. పరమోత్కృష్టమైన మహాశక్తి మరొకటుందని నీవల్ల గ్రహించాను. ఈ ధ్యానంలో యీ జీవితం యింతటితో చాలిస్తాను. నా మనస్సుకు శాంతి కావాలి. ఈ లోకంలో అది లభ్యం కాదు.

"తమ్ముడూ!! నన్ను క్షమించవూ? తీరని అపచారాలెన్నో చేశాను. మాయని మచ్చ లేర్పరచాను. నా దురాచారాలు క్షమార్హమైనవి కావు. కాని మిగిలిన యీ బహుకొద్ది జీవితం ప్రశాంతంగా దొర్లిపోవటానికి, నీ నోటినుంచి ఆ మాట అను."—

"అన్నా!..." అంటూ విరుచుకొని పడిపోయాడు మోరల్ ఎర్నెష్టు కాళ్ళమీద:—"నా మాట విను. నాతో వస్తావుకదూ?....మాట్లాడవేం?..."

"కోరికలు నశించినప్పుడు జీవించటం దేనికి?"

"నాకోసం..." అన్నాడు మోరల్.

"నేను రాను తమ్ముడూ!...నా గురించి నువ్వు బాధపడకు. నా జీవితంలో ఒక్క మంచిపని చేశాను. ఒక వ్యక్తిని బ్రతికించాను. అంతే...అదే నాకు సంతృప్తి..."

"నా కెక్కువ మాటలు రావు. నిన్నొక్కటే అడుగుతున్నాను. ఇప్పుడంతా నా చేతుల్లో ఉంది. ఇద్దరం కలిసి పారిపోదాం. వస్తానను. రానంటే ఇక్కడే తల బ్రద్దల కొట్టుకొని చచ్చిపోతాను. ఆ మాట అను. ఆ మాట అను..."

ఎర్నెష్టుకు ఏమి చేయడానికి తోచలేదు. అతని దృష్టిపథంలో లిల్లీ మెరసింది. వెంటనే:—"రాను" —అన్నాడు.

మోరల్ తల నేలమీద మోదుకోవడం మొదలుపెట్టాడు. వారించటానికి వీల్లేకుండా ఎర్నెష్టు చేతులు కట్టివేయబడి వున్నాయి:—"సరే"—అన్నాడా ఖరుకు.

*   *   *   *

కెప్టెన్ వెనం విచారణ కుద్యమించాడు. ఫాన్సు వెనుక నిలుచొనిఉన్నాడు:—"దేశద్రోహీ! నన్ను నమ్మించి, నాకళ్ళల్లో మట్టికొట్టి, మాతృదేశాన్ని పరహస్తాల్లో నుంచటానికి ప్రయత్నించావు. మోరల్! నన్నే మోసంచేద్దామనుకున్నావుకదూ..." అంటూ వెనం ఎర్నెష్టుదగ్గరకొచ్చాడు:—"చెప్పు నీ కిదివరకితను తెలుసా? యుద్ధభూమిలోని యితన్ని తీసుకొనిరావటానికి కారణం ఏమిటి? నిన్నెందు కితను వదిలిపెట్టటానికి సిద్ధపడ్డాడు...మాట్లాడవేం?..."

"నేను చెప్పేది ఏమీ లేదు..."

"రాస్కెల్..." అంటూ ఎర్నెష్టును ఆ లెంప యీ లెంప వాయించేశాడు వెనమ్.

"అన్నా!..." దుఃఖమాపుకోలేక బిగ్గరగా అరచాడు మోరల్ ... కండ్లవెంట బొటబొటా నీళ్లు కారాయి.

"ఛీ! ఏడవొచ్చా! సైనికుడు మృత్యువుకు వెరుస్తాడా?..." అన్నాడు ఎర్నెష్టు.

"కాని వాళ్లు మన్ని అర్థంచేసుకోలేకపోయారు..."

"పోనీలే! నువ్వు చెప్పావుగా! —దేవుడంటూ ఒకడున్నాడని..."

బయటనుంచి ఒక సైనికుడు ఒక అమ్మాయిని ముందుకు తోశాడు : — 'ఇదిగో సార్ ! ... యీ అమ్మాయే హాస్పటల్లో మోరల్ తో ఉంది. తీసుకొని వచ్చాం....'

లిల్లీ లోనికి వచ్చింది. మోరల్‌ను చూచి కంట తడిపెట్టింది: మోరల్ ఆమెకేసి తిరిగాడు:—"లిల్లీ, నేను దేశానికి ద్రోహం చేశానట. దేశద్రోహిని. నాకేశిక్ష విధిస్తారో యింకా చెప్పలేను. ఒకరోజున నిన్ను నేను ప్రేమించాను. కాని అతడు నీభర్త..." అంటూ ఎర్నెష్టును చూపాడు. లిల్లీ, ఎర్నెష్టు ఒక్కసారిగా ఏదో అనబోయారు. కాని—"ఆగండి. లిల్లీ!...ఒక దేశపురాజు...మరో దేశపు రాణి...రెండు దేశాలకు ఒక యువరాజు. రెంటికి అతనే వారసుడు. నీకుమారుడే ఒక కానుక. శాంతిదూత...ఏడవకు ..."

"నిశ్శబ్దం...." ఖంగున అరచాడు వెనం — "మోరల్! ... నువ్వు కుట్రచేయటానికీ, యీ దేశద్రోహచర్యకు ఉద్యమించటానికి గల కారణాలు చెప్పు."

మోరల్ మొదలుపెట్టాడు : — "నేను చెప్పబోయేది మీరు కడదాకా వింటారని నాకు నమ్మకం లేదు. నేనిప్పుడు ప్రపంచంలో దేనికీ భయపడను. మృత్యువు నాహ్వానిస్తున్నాను.

"మానవునకు కావలసిందేమిటి? తిండి, బట్ట. అవెప్పుడు, ఎలా లభ్యమవుతాయి? ప్రశాంతత భగ్నమైన యీ పరిస్థితుల్లో, తనకేం కావాలో మానవుడెలా సమకూర్చుకోగలడు? మనిషికి స్వస్థత లేదు. ఈరోజు తనది, రేపు మరొకడిది. చల్లటి సంసారాలన్నీ చెల్లాచెదరయిపోయాయి. రేపు ఏం జరుగుతుందో ఎవడికీ తెలియదు. మానవునకు శాంతి... భద్రతలు కావాలి. అప్పుడే కమ్మగా తింటాడు... హాయిగా ఉంటాడు.

"ప్రజా నినాదం ఎప్పుడైనా విన్నారా?"

"అందరికి అన్నం కావాలి, బట్ట కావాలి. సుఖం కోరుకుంటారు. అందరికి జబ్బులొస్తాయి, పుడతారు...చస్తారు...ఆశలు, కోరికలు ఆశయాలు అన్నీ ఉంటాయి. ఇవి అందరికీ ఉంటాయి. వీటన్నింటిని చంపుకొని మానవుడు ప్రాణాలను బలిదానం చేస్తున్నాడు. దేనికి?.. ఏ మహాత్కార్యం సాధించటంకోసం?

"మమ్మల్ని పశువుల్లా యుద్ధంలోకి గదిమారు. ఎందుకోసం? ఎవరికోసం యుద్ధం చేస్తున్నామో మాలో ఒక్కడికీ తెలియదు. ప్రతి గుండుతో ఒక శత్రువును చంపమన్నారు. ఎవడా శత్రువు. అతనికీ నాకూ శత్రుత్వమెలా ఉంది. ఎవరు ఎవరికి ఏం అపచారం చేశాం...

"నేను దేశద్రోహిని. అవును కదూ?

"మమ్మల్ని బలవంతంగా యుద్ధానికి పంపారు. మా సంసారాలకు మీరేం రక్షణ కల్పించారు. నా సంసారం నాశనమయింది. అన్నంలేక అల్లాడిపోయారు. నాతల్లి క్షుధాగ్నితో దహించుకొని పోయింది. నా తండ్రి మొదటి యుద్ధంలో అసువులు విడచాడు. నా అన్న రెండోయుద్ధంలో ప్రాణాలర్పించాడు. నా ప్రేయసి బలవంతంగా చెరుపబడింది. ఇన్ని విధాలా నాశనమయ్యాం. మాకేం మేలు చేకూరింది? మా సంసారంలాగా ఎందరి సంసారాలిలా ఆహుతయిపోయాయో ఎప్పుడన్నా గమనించారా? దీనికంతా కారణం ఏమిటి? యుద్ధాల వల్ల చేకూరే మేలేమిటి ?

"ప్రజలకు శాంతి భద్రతలను చేకూర్చి క్షేమంగా పరిపాలించటమా ప్రజాప్రభుత్వాల లక్ష్యం ... అందర్ని హతమార్చటమా?...మాట్లాడరేం?...

"మైలార్డ్! నేను దేశద్రోహిని కదూ?

"మేం మానవులుగా మనటానికి ప్రయత్నించాం. శాంతిని ఆకాంక్షించే దేశానికి పారిపోయి ప్రశాంతమైన జీవితం గడపటానికి నిశ్చయించాం. కాని మీరు మమ్మల్ని మానవులుగా మననీయలేదు.

"మైలార్డ్!—మీరు విచారించేది న్యాయాన్ని మాత్రమే. న్యాయానికతీతమైన ధర్మాన్ని కాదు. న్యాయానికి కండ్లు లేవు; చెవులుమాత్రమే వున్నాయి. ధర్మానికి యీ రెండూ కావాలి; ఇంకా ఆత్మసంస్కారం, ఆత్మసాక్షాత్కారం కావాలి. మహాత్ములు మహర్షులు తప్ప విడిచి మామూలువాళ్లు ధర్మాన్ని విచారించలేరు. అక్కడ [అంటూ ఆకాశంకేసి చూపాడు] వాడు విచారిస్తాడు ధర్మాన్ని.

"అబ్బా!...మేం...దేశ...ద్రోహులం...... మై...లార్డ్! మేం...ద్రోహులం......" అంటూ గుండె పట్టుకొని విరుచుకొని పడిపోయాడు మోరల్. మళ్ళీ లేవలేదు; లేవడు. పట్టుకున్న యిద్దరు సైనికుల్ని ఒక్క విదిలింపుతో అంత దూరానికి నెట్టేసి "తమ్ముడూ!" అంటూ మోరల్‌ను కౌగలించుకున్నాడు ఎర్నెష్టు.

ఎర్నెష్టు పారిపోతున్నాడేమోనని ఖంగారుపడి కాలికి గురిపెట్టి పిస్టల్ పేల్చాడు ఫాక్సు. కాని ఎర్నెష్టు గభాలున కూలబడటంలో గుండెల్లోనుంచే దూసుకుపోయింది.

ప్రళయఘోషలతో వీరవిహారం చేసే బ్రహ్మాండమైన సముద్రాన్ని యిద్దరు సాహసులు దాటబోయారు. కాని......